# రెండు దుకాణాలు

-పెద్దింటి అశోక్ కుమార్

"ఆ షాపును వారంలో మూయించేస్తాను" దేవదాసు కవితతో అన్నాడు. కవిత భర్త వైపు అసహనంగా చూసింది. నమ్మలేనట్టుగా కూడా చూసింది. ఆరోజు కలెక్షన్ వంద కూడా లేదు. అందుకే ఆమెకు దిగులు కూడా పట్టుకుంది. అది గమనించే ఊరడించాలని అన్నాడు దేవదాసు.

"మనం షాపు తెరిచి నెల దాటలేదు. వాడు ఐదారేండ్ల నుండి నడిపిస్తున్నాడు. వాడికి పర్మినెంటు ఖాతాదారులు కూడా ఉన్నారు. బిజినెస్ టెక్నిక్‌లు తెలిసినోడు" అపనమ్మకంగా అన్నది కవిత.

"ఎన్ని ఉన్నా వాడికి డబ్బు లేదు గదా!" ధీమాగా అన్నాడు దేవదాసు.

"లేకపోతేనేం... అది ఉన్నది చూసావూ... వాడి పెళ్లాం. వగలుపోతూ పొద్దంతా గల్లాపెట్టె ముందే కూర్చుంటుంది. వచ్చేపోయే వాళ్లను వరుసలు పెట్టి పిలుస్తుంది. ఇకఇకలు పకపకలు. అందరినీ తనవైపే తిప్పుకుంటుంది..." అక్కసుగా అన్నది కవిత. "...అదేంటో దాన్ని చూడగానే బెల్లం చుట్టు ఈగల్లా మూగుతున్నారు."

"అది వాడి ఆఖరు ఆయుధం" నవ్వుతూ అన్నాడు దేవదాసు.

కవితకు అర్థం కాలేదు. బయటకు తొంగి చూసింది. పోటీ పెట్టుకున్నట్టు ఎదురుగానే ఉంది వీరేశం షాపు. మధ్యలో రోడ్డు. ఆ సమయానికి సుజాత బయటకు వచ్చి నిలబడింది. రోడ్డు వెంట ఎవరో వెళ్తే మాట్లాడుతూంది. అతడు ఆగి ఎక్కాల పుస్తకం కావాలని అడుగుతున్నాడు.

"ఒక్క ఎక్కాల పుస్తకమే కాదల్లుడా... ఏడో తరగతి వరకు అన్ని పుస్తకాలున్నాయి. కంపాక్స్ పెట్టెలు కూడా..." గట్టిగా అంటూ అతడితో ఇంకేవో కొనిపిస్తున్నది సుజాత.

"అదీ వరుస. మనిషి కనిపిస్తే చాలు. అడుగు కదలనియ్యదు..." భర్తకు చిన్నగా చెప్పి గొంతు పెంచి "ఈ దుకాణం పాడుగాను. నడిస్తే ఎంత? నడువకపోతే ఎంత? బజారు పనులు నావల్ల కాదు బాబు..." అన్నది కవిత ఆమెకు వినిపించాలని గట్టిగా.

"వీడు నోటు బుక్స్ ఎప్పటి నుంచి అమ్ముతున్నాడు...?" దేవదాసు అడిగాడు.

"మొన్నటి నుండే! ఒక్క నోటు బుక్సే కాదు. ప్యాలాలు, పుట్నాలు, ఉప్పు, పప్పు నుంచి గుట్కాల దాకా... అన్ని వస్తువులు తెచ్చి మనల్ని పడగొట్టాలనుకుంటున్నాడు." అక్కసుగా అన్నది కవిత.

కొద్దిసేపు ఆలోచించి "కూరగాయల్లో ఏవి రేటు ఎక్కువగా ఉన్నాయి" అడిగాడు దేవదాసు. కవిత చూపంతా ఎదుటి దుకాణంపైనే ఉంది. చూపు తిప్పుకోకుండానే "టమాటాలు... ఇరవైకి కిలో..." అన్నది.

"రేపు ఇరవై కిలోల టమాటాలు, పది కిలోల పుచ్చు వంకాయలు, ఇరవై కిలోల మురిగిపోయిన ఉల్లిపాయలు, చేదు దోసకాయలు, కల్తీ నూనె, పప్పులు, ముదిరిన బెండకాయలు, పురుగు పట్టిన పుట్నాలు... మొత్తం కల్తీ సామాను తీసుకురావాలి..." దేవదాసు చెబుతున్నాడు.

భర్త వైపు అదిరిపడి చూసింది కవిత. "తక్కువ ధరకు కల్తీ సామాన్లు తెచ్చి ఎక్కువ ధరకు అమ్మాలని చూస్తున్నావేమో! ఆ పప్పులేం ఉడకవు. జనం తెలివిమీరి పోయారు. చిన్నగా కల్తీ కనబడితే మొహం మీద కొట్టిపోతారు. ఇప్పటికే మనం కల్తీ సామాన్లు అమ్ముతున్నామని వాళ్లు ప్రచారం చేస్తున్నారు."

"అవి జనాలకు అమ్మడానికి కాదు." నవ్వుతూ అన్నాడు దేవదాసు.

కవితకు అర్థం కాలేదు. భర్తవైపు విచిత్రంగా చూసింది. రాత్రి తొమ్మిది దాటడంతో షట్టర్‌ను కిందికి దించింది.

★☆★

దుకాణం తలుపు మూసి ఇంట్లోకి వెళ్లింది

సుజాత. వీరేశం వడకత్తెరతో పోక చెక్కల్ని ముక్కలు ముక్కలుగా కత్తిరిస్తున్నాడు. తొడమీద చిన్న కూతురు పడుకుంది. పెద్ద కూతురు పోక చెక్కల్ని కుప్పలు పోస్తుంది.

"రోజుకొక కొత్త దుకాణం. ఏదీ కొనముట్టుతలేదు. ఈ పాన్ షాపు నడుస్తదన్న నమ్మకం లేదు నాకు." నీరసంగా భర్త పక్కన కూర్చుంటూ అన్నది సుజాత. ఆమె అచ్చం పాలరాతి బొమ్మలా ఉంటుంది.

వీరేశం భార్య వైపు భయం భయంగా చూశాడు. వ్యాపారంలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఆమె ముందుగానే ఊహించి చెబుతుంది. కానుగు పలుకుల సీజన్లో ధర తగ్గుతుందని చెప్పింది. నిజంగానే ధర తగ్గి నష్టం వచ్చింది. జాతరకు గాజులు బొమ్మలు వద్దని చెప్పింది. వినకుండా తెస్తే సగం కూడా అమ్ముడవలేదు. రాఖీ పౌర్ణమికి రాఖీల గిరాకీ ఉంటుందని చెప్పింది. నిజంగానే వెయ్యి రూపాయల గిరాకీ తగిలింది. ఆరు నెలల నుండే ఇక్కడో షాపు తెరిచేట్టున్నారని అనుమానం వ్యక్తపరిచింది. నిజంగా అలాగే జరిగింది. అందుకే వీరేశంకు భయం. మాట మీద గురి.

"ఏం... ఎందుకలా అంటున్నావు...?" చేస్తున్న పని ఆపి అడిగాడు వీరేశం.

"మనది చిన్న కిరాణ షాపు. ఏవో పప్పులు ఉప్పులు అమ్ముతాం. ఇక్కడికి పాన్ తినడానికి ఎవరొస్తారు చెప్పు" తమలపాకుల బుట్టను అందుకుంటూ అన్నది సుజాత.

"పోటీని తట్టుకోవడానికి ఏదో ఒకటి చెయ్యాలి. కొత్తదనం చూపించాలి. మన ఎదురు దుకాణం వాళ్లు చూడు. ఏది దొరికితే అది అమ్ముతండ్రు." బదులుగా అన్నాడు వీరేశం. "కూరగాయలూ అమ్ముతున్నారు."

"పోటీ... పోటీ అని అడ్డమైన సామాన్లు నెత్తి నెత్తుకున్నం... అడ్డమైన మాటలూనూ..." నీరసంగా అంటూ నవ్వడానికి ప్రయత్నించింది. అంతకంటే ముందుగానే కళ్లు చెమ్మగిల్లాయి. మొహం దాచుకోవడానికి ప్రయత్నించింది సుజాత. గొంతులో వచ్చిన మార్పు ఆమెను పట్టి ఇచ్చింది.

జీవితంలో రాటుదేలినాక ఎంతగానో బాధపడితే తప్ప కంట తడిపెట్టదని వీరేశంకు తెలుసు. అప్పుడప్పుడూ సైకిల్ మీద సామాన్లు తేవడం, సీజన్లో ఊరంతా తిరిగి చింతగింజలు, కానుగు పలుకులు కొనడం, తవ్వెడు, మానెడు, చిల్లర చిల్లర ధాన్యాలు కొనడం చేస్తుంటాడు వీరేశం. వీటిని ఎండకు పెట్టడం సంచుల్లో ఎత్తడం చేస్తుంది సుజాత. వీరేశం పొద్దంతా దుకాణంలో కూర్చుండేవాడు. ఈ నెల రోజుల నుంచి సుజాతను కూర్చోబెడుతున్నాడు.

"ఎవరైనా ఏమైనా అన్నారా...?" చేస్తున్న పనిని ఆపి అడిగాడు. అతడి గొంతులో అసహాయత ఉంది. భర్త వైపు దిగులుగా చూసింది సుజాత.


"నన్ను చూడడానికే గిరాకీ వస్తున్నారట. నేను అందరినీ ఆకర్షిస్తున్నానట..." ఆపైన చెప్పలేకపోయింది సుజాత.

వీరేశం తలవంచుకుని పనిలో మునిగిపోయాడు. ఆరేండ్ల కూతురు ఇద్దరివైపు అర్థం కానట్టు చూసి పోసిన కుప్పలను చెరిపేస్తుంది. దోమ కుట్టినట్టుంది. నిద్రలోనే చిన్న కూతురు ఏడుపందుకుంది.

కూతురును తన దగ్గరికి తీసుకుంది సుజాత. జోకొట్టి నిద్రపుచ్చుతూ "ఎవరేమనుకుంటే నాకేం. నా భయం అది కాదు. గిరాకీ సగానికి సగం తగ్గిపోయింది. వాళ్లు తెచ్చిన ధరకంటే తక్కువ రేటుకు అమ్ముతున్నారు. ఇంతవరకు బట్ట పొట్ట గడిచింది. ఇప్పుడు దుకాణం మూసుకోవాల్సిందే!" అన్నది.

మళ్లీ కళ్లు చెమ్మగిల్లినట్టున్నాయి. కొంగుతో తుడుచుకుంది. తమలపాకుల్ని మడతపెడుతున్నది.

ఆమె చివరి మాటలు విన్నాక వీరేశం వణికిపోయాడు. దుకాణం పెట్టకముందు బీడీల గంపను సైకిల్ మీద జారేసేవాడు. సైకిలు తొక్కుతుంటే కడుపులో పేగులు నోట్లోకొచ్చేవి. ఆ పని మాని దుకాణం పెట్టాడు. పల్లెటూరు కాబట్టి గిరాకీ మూడు వందలకు మించేది కాదు.



ఎందులో.రేటు ఎక్కువయినా వెంటనే అడిగేవారు జనం. టౌను, మండల కేంద్రం దగ్గరే కాబట్టి ఏ వస్తువు ఏ రేటో జనానికి బాగా తెలుసు. అలా పది శాతం కంటే మించేది కాదు లాభం. ఆ సంపాదనతోనే అప్పు అంశం లేకుండా నెట్టుకొస్తున్నాడు.

"మనం ఎత్తుకు పైఎత్తు వెయ్యాలి. పోటీ కదా!" పైకి మాత్రం గంభీరంగా అన్నాడు.

"ఏం ఎత్తు వేస్తాం. వాడు లాభం లేకుండా దుకాణం నడిపి ఐదేండ్లయినా బతకగలడు. మనం ఐదు రోజులు బతకలేం." నిరాశగా అంటూ కొంగు పరుచుకుని ఒరిగిపోయింది సుజాత.

కరెంటు పోయింది. నిండా చీకటి. చేతితో తడుముకుంటూ గోడకు ఒరిగిపోతూ "ఏ ఎత్తు వెయ్యాలో వాళ్లే చెప్పారు కదా!" అన్నాడు. సుజాత మరింత ముడుచుకుపోయింది. ఆ రాత్రి కరెంటు రాలేదు. ఇద్దరూ ముద్ద ముట్టలేదు.

★☆★

పురుగు పట్టిన పప్పులు నకిలీ సామాన్లు నాసిరకం నూనెలు పుచ్చుపట్టిన కూరగాయలు

మొత్తం వెయ్యి రూపాయల సామాన్లు ఆటోలో ఇంటి ముందు దిగాయి. దేవదాసు వాటిని దుకాణంలో సర్దుతున్నాడు.

"వీటిని అమ్మితే మనం దుకాణాన్ని నాలుగు రోజులు కూడా నడుపలేం. వాళ్ల దుకాణం మూపిస్తానని మనమే మూసుకునేట్టు చేస్తున్నావు." కవిత మరోసారి హెచ్చరించింది.

దేవదాను సమాధానం చెప్పలేదు. నవ్వుకుంటూ పనిలో మునిగిపోయాడు.

"ఇప్పుడిప్పుడే గిరాకి పెరుగుతుంది. జనంలో నమ్మకం కుదురుతుంది. ఈ పనితో ఆ పేరు కాస్తా గోవిందా..." కాస్త కోపంగానే అన్నది కవిత. అంటూ ఎదురుగా ఉన్న దుకాణం వైపు చూసింది. అప్పుడప్పుడు బీడీలు, అగ్గిపెట్టెలు, సిగరెట్ డబ్బాల గిరాకీ బాగానే ఉంది. సుజాత నవ్వుతూ పాన్‌లు కట్టి ఇస్తోంది. ఎన్నడూ కనిపించని వాళ్లు కూడా దుకాణం ముందు కనిపిస్తున్నారు. అప్పుడే కుమ్మరి నర్సమ్మ పప్పు కొరకు వచ్చింది.

"దునియ పాడుగాను. ఎంత చెడిపోయింది. ఎవలను మంచోళ్లనన్తలేదు. ఎవలను చెడ్డోళ్లనస్తలేదు. ఏమేశం పాడైంది. టేటర్ మీది బొమ్మ లెక్క తయారై కూసుంటుంది. ఎవని కొంప ముంచుతదో..." ఎదురు దుకాణం వైపు కోపంగా చూసి అంటూ "పావు కిలో పెసర పప్పు ఇయ్యి" అన్నది నర్సమ్మ పది నోటును అందిస్తూ.

సుజాత పప్పును అందుకునేలోపే లేచి అడ్డం నిలబడి "పెసర పప్పు లేదమ్మా" అన్నాడు దేవదాసు.

భర్తవైపు అర్థం కానట్టు చూసింది కవిత. ఉన్నా కూడా లేదని ఎందుకు అబద్ధమాడుతున్నాడో ఆమెకు అర్థం కాలేదు. భార్యకు కళ్లతోనే సైగ చేసాడు దేవదాసు.

"అయ్యో! పెసరపప్పు లేకుంటే కందిపప్పు ఇయ్యి" నర్సమ్మ అన్నది.

"అసలు పప్పులే లేవమ్మా! సామాన్లు అయిపోయినయి. దుకాణం మూసేత్తన్నం." అన్నాడు. నర్సమ్మ గొణుక్కుంటూ కాసేపు నిలబడి అయిష్టంగానే సుజాత దుకాణం వైపు వెళ్లింది. అటువైపు వెళ్లేదే కాదు గానీ దరిదాపులో మరో దుకాణం లేదు.

కవిత మరోసారి భర్తవైపు కోపంగా చూసింది. నీకు తెలియదులే అన్నట్టు చూసాడు దేవదాసు. ఆరోజు దుకాణంలోకి వచ్చిన ప్రతి మనిషిని ఇలాగే చెప్పి తిప్పి పంపాడు దేవదాసు. అతడు దుకాణం మూసేస్తున్నాడని ఊరంతా తెలిసిపోయింది. భర్త ఏదో బలమైన ఎత్తునే వేశాడనుకుంది కవిత. తను కూడా అలాగే ప్రచారం చేసింది. మంచి సరుకును లోపల దాచి పురుగుపట్టిన సరుకును బయట ఉంచారు.

★☆★

"మనకో శుభవార్త. వాళ్లు దుకాణం మూసేస్తున్నారట." వీరేశం అన్నాడు. పక్కనే కూర్చుంటూ సుజాత బదులు చెప్పలేదు. ఆరోజు గిరాకీ డబ్బుల్ని లెక్క పెడుతుంది. మూడు పచ్చనోట్లు కనిపిస్తున్నాయి. పది, ఇరువై, యాభై నోట్లు కూడా ఉన్నాయి. రెండు గిన్నెల నిండా చిల్లర డబ్బులున్నాయి.

"చూసావా... పాన్‌లు అమ్ముడుపోవని చెప్పావు. మొదటిరోజే గంపెడు పాన్‌లు అమ్ముడయ్యాయి. దుకాణం పెట్టిన్నుండి ఇంత గిరాకీ ఎప్పుడూ రాలేదు" తనే అన్నాడు మళ్లీ. దగ్గరకు జరిగి.

రాత్రి తొమ్మిది దాటింది. పిల్లలిద్దరూ పడుకున్నారు. కుప్పపోసిన డబ్బుల్ని చూస్తుంటే సుజాతకు సంతోషంగా లేదు. యాంత్రికంగా లెక్కపెడుతుంది.

అప్పుడే తలుపు చప్పుడయింది. ఎవరో పిలుస్తున్నారు.

"గిరాకీ వచ్చినట్టుంది. వెళ్లు..." భార్యతో అన్నాడు వీరేశం.

"నేను వెళ్లను. నువ్వే వెళ్లు..." భార్యతో అన్నాడు వీరేశం.

వీరేశం వెళ్లి తలుపు తెరిచాడు. ఇద్దరు ఎస్సీల పిల్లలు. ఇంటర్ ఫేలయిన బావతు. తాగినట్టున్నారు. వాసన గుప్పుమంటుంది. అయినా అదుపులోనే ఉన్నారు. వీరేశంను చూడగానే మొహం చిట్లించారు. వంద నోటు తీసినవాళ్లు జేబులో కుక్కుకుని చిల్లర విసిరికొట్టి

చెరో సిగరెట్ కొన్నారు. ఇంట్లోకి తొంగి చూస్తూ బయటపడ్డారు.

వీరేశం తలుపులు మూసి భార్య వద్దకు వచ్చి కూర్చున్నాడు. అప్పటికి చిల్లరను, నోట్లను వేరువేరు చేసి కుప్పలు పోసింది సుజాత. వాటిని లెక్కించడంలో సహాయం చేసాడు. డబ్బును చూస్తుంటే ఉత్సాహంగా ఉంది. అన్నీ లెక్క చూసేసరికి మళ్లీ తలుపు చప్పుడు.

"గిరాకీ వచ్చినట్టుంది వెళ్లు..." భార్యకు చెప్పాడు వీరేశం.

"నువ్వే వెళ్లు" డబ్బును దాస్తూ అన్నది.

"అబ్బా... నీరసంగా ఉందే! కాళ్లు చేతులు లాగుతున్నాయి." ఇబ్బందిగా మొహం పెడుతూ అన్నాడు గోడకు ఒరిగి.

అతడివైపు ఒకసారి సీరియస్‌గా చూసి విసురుగా వెళ్లింది సుజాత. పావు గంట తర్వాత యాభై నోటుతో వచ్చింది. నోటును పెట్టెలో నిర్లక్ష్యంగా పడేసి మంచంలో ఒరిగిపోయింది.

"వాళ్లు దుకాణం మూసేస్తున్నారట. మనకు ఏ టెన్షనూ ఉండదు. వారం ఓపిక పడితే చాలు." ఆమె పక్కకు చేరి అన్నాడు అనునయిస్తున్నట్టుగా.

"ఎవరు ఏమైనా కాని. నేను మాత్రం రేపటి నుండి దుకాణంలో కూర్చోను. బతుకు దెరువుకే అయితే ఏదైనా కూలీ చేస్తాను." నిక్కచ్చితంగా చెప్పింది సుజాత.

ఆమెను ఒప్పించడానికి ప్రయత్నించేవాడే! అప్పటికే ఆమె వెక్కుతుంది. ఎందుకని వీరేశం అడగలేదు. కారణం ఇది అని సుజాత చెప్పలేదు. అతడికి బతుకుమీద భయం పట్టుకుంది.

రాత్రి ఇద్దరికీ నిద్ర పట్టలేదు. ఏవేవో గుర్తుకొచ్చాయి. పీడకలలొచ్చాయి. నిద్రలో ఎదురుగా ఉండే దుకాణమే కనిపించింది.

మరునాడు సుజాత మంచంలోంచి లేవలేదు. వీరేశం లేపడానికి ప్రయత్నించాడు. అతడి చేతిని విసిరికొట్టి దుప్పటి కప్పుకుంది. నీరసంగా వచ్చి గల్లా పెట్టె ముందు కూర్చున్నాడు వీరేశం.

★☆★

"అసలు విషయం ఇప్పుడు తెలుస్తాను చూడు." దేవదాసు అన్నాడు భార్యతో. అప్పటికే మూడు రోజులయింది. ఎవరికీ సామాన్లు అమ్మకుండా ఊరకే కూర్చుంటున్నది కవిత.

"ఏదో ఒకటి చేసెయ్. గిరాకీని ఉత్త పుణ్యానికి వాళ్లకు అప్పగించడం ఎందుకు" కోపంగా అన్నది.

"ఎంత ఓపిక పడితే అంత ఫలితం ఉంటుంది మరి" దేవదాసు అన్నాడు. అంటూ వీరేశం షాపు వైపు కదిలాడు.

షాపులో వీరేశం ఒక్కడే కూర్చున్నాడు. దేవదాసును చూడగానే ఆశ్చర్యంతో నోరు తెరిచాడు. అంతకు ముందు అందరిలాగే దేవదాసు కూడా సరుకులకు వచ్చేవాడు. ఖాతా తెరిచేవాడు. ఇంటి ముందు ఇల్లే. రోడ్డువైపు షట్టర్

## సాహిత్య పురస్కారాలు

ఆంధ్ర సారస్వత సమితి (బందరు) కార్యదర్శి శ్రీ కె.వై.ఎల్. నరసింహ ఇలా తెలియజేస్తున్నారు. ఏటా యిచ్చే సాహిత్య పురస్కారాలు 2003 సం.కు 2004 ఉగాదినాడు ఇస్తాము. ఒక్కొక్క కవికి/ రచయితకు రూ.2000/- నగదు. పది సాహిత్య ప్రక్రియల్లో 1) పద్య కవిత, 2) వచన కవిత, 3) నాటక రంగం (విమర్శ, నాటకాలు, నాటికల సంపుటి) 4) భక్తి రస (ఆధ్యాత్మిక) వచన గ్రంథం 5) కథ 6) నవల 7) సాహిత్య విమర్శ 8) హైకూలు 9) హాస్య రచన 10) బాల సాహిత్యం. ఒక్కొక్క ప్రక్రియలోను నాలుగేసి కాపీలు ఈ జనవరి ఒకటిలోగా పంపాలి. అవి 2001, 2002, 2003లో ప్రచురింపబడినవి మాత్రమే. ఆ పుస్తకాలకు గతంలో ఏ రకమైన బహుమతులు వచ్చినా అవి ఈ ఎంపికకు అర్హములు కావు. పుస్తకాలతో పాటు రూ.25/- ఎంట్రీ ఫీజు పంపిన ఎం.ఓ. రశీదు జతచేయాలి.

పుస్తకాలు ఎం.ఓ. పంపవలసిన అడ్రసు: **డా. మాదిరాజు రామలింగేశ్వర రావు,** 23/181-1, అగ్రహారం వీధి నెం.1, రామా నాయుడుపేట, మచిలీపట్నం-521 001.

కట్టి దుకాణం పెట్టాలనే ఆలోచన వచ్చిన నుండి సరుకులకు రావడం మానేసాడు.

స్టూల్‌ను దగ్గరికి లాక్కుని కూర్చుంటూ "దుకాణం నడుపుడంటే ఏమో అనుకున్న. నెలలోపలనే రెండు వెయిలు లాసయిన. ఒక పాన్ కట్టియ్యి..." రెండ్రూపాయల బిళ్ల ఇస్తూ అన్నాడు దేవదాస్.

వీరేశంకు ఏదో మంచి వార్త విన్నంత ఆనందంగా అనిపించింది. పాన్ కడుతూ "ఏదైనా దిగితేనే లోతు తెలుస్తది. ఇండ్ల నేనేదో సంపాయించిన ననుకున్నవు. నాకు పోటీ పెట్టినవు." అన్నాడు.

"అవునురా! ఇక్కడ ఒక్కటే దుకాణముండాలె. నువ్వన్న మూసెయ్యి. నేనన్న మూసేత్త." ఎత్తుగడ వేస్తూ అన్నాడు.

"నేనెందుకు మూసేత్త. నువ్వే మూసెయ్యి..." విసురుగా అన్నాడు వీరేశం. దేవదాసు దుకాణం మూసేస్తాడన్న నమ్మకం కుదిరిపోయింది అతనికి.

"సరే! నేనే మూసేత్త. నా దుకాణంల సరుకంతా నువ్వు కొను. లేదంటే నువ్వు మూసెయ్యి. నీ సరుకంతా నేను కొంటా. ఏదో ఒకటి నాకు ఆలోచించుకుని సాయంత్రంలోగా చెప్పెయ్ లేదంటే రేట్లు మొత్తం తగ్గించి అమ్ముత. నీ దగ్గరికి ఒక్కరిని రాకుండ చేస్త." పాన్‌ను అందుకుని నములుతూ బయటపడ్డాడు దేవదాసు.

వీరేశం ఆలోచనల్లో పడ్డాడు. అతడు దుకాణం పెట్టినాక పోటీని తట్టుకోవడానికి తను ఎన్నెన్ని బాధలు పడ్డది గుర్తు చేసుకున్నాడు. ఏడాది పాటు లాభం లేకపోయినా సరే! పోటీ మాత్రం వద్దనుకున్నాడు. ఈ విషయం భార్యతో చర్చించాడు.

"వాడు సామాన్యుడు కాదు. మనను ఏదో చెయ్యాలనుకుంటున్నాడు. వాని సామాను వద్దు దుకాణం వద్దు. మనకు ఎంత గిరాకీ అయితే అంతే చాలు." అన్నది సుజాత.

వీరేశం వినలేదు. భార్య ఏడుపే గుర్తొచ్చిందతనికి. మధ్యాహ్నం దాకా ఆలోచించాడు. ఒక నిర్ణయానికి వచ్చాడు. దేవదాను దుకాణంలోకి వెళ్లి సరుకులన్నీ చూసాడు. మురిగిన కూరగాయలు, నకిలీ సామాన్లే కనిపించాయి.

"నాకు వ్యాపారం గురించి తెలియదు. ఇలాంటి సరుకులు తెచ్చి మోసపోయాను. ఈ జన్మలో వ్యాపారం పేరెత్తకుండా అయింది." బాధపడుతూ అన్నాడు దేవదాసు. కవిత కూడా వంత పాడింది.

సరుకులన్నీ లెక్క చూసారు. ఐదు వెయిల పైనే అయ్యాయి. వెంటనే కట్టాలంటాడు దేవదాసు. వీరేశం దగ్గర డబ్బులేదు. భార్యతో మరోసారి చర్చించాడు వీరేశం. ఆమెను ఒప్పించాడు.

"వాడు ఒక్క చిత్తం మనిషి కాదు. ఆలస్యం చేస్తే మనసు మార్చుకుంటాడు" భయం భయంగా అన్నాడు వీరేశం.

చెవుల కమ్మలు, పెండ్లి ఉంగరం తీసి ఇచ్చింది సుజాత. మెడలో పుస్తెల తాడు ఇదివరకే కుదువ ఉన్నది. వాటిని కుదువబెట్టి మిగిలింది అప్పు తెచ్చాడు వీరేశం. ఏదైతే అయింది. పోటీ లేకుండా అయిందనుకున్నాడు.

ఎందులోనూ రేటు తగ్గలేదు దేవదాసు. ఒక రూపాయి ఎక్కువే చెప్పాడు. తేపతేపకు 'నీ యిష్టం. ఈ రేటుకయితే కొను. లేకుంటే లేదు' అంటున్నాడు. కవిత 'నష్టానికి అమ్ముడెందుకు. దుకాణం నడిపిద్దాం' అంటుంది.

ఆరోజు రాత్రి డబ్బు ముట్టజెప్పాడు వీరేశం. భార్యా భర్తలిద్దరూ అర్ధరాత్రి వరకు సామాన్లను జారవేసుకున్నారు.

"వీటికి ఐదు వెయిలు పెట్టావు. అమ్మితే ఐదు వందలు రావు. ఈ పురుగు పట్టిన పప్పులు, మురిగిపోయిన కూరగాయలు ఏం చేసుకుంటావు" యాష్టపడింది సుజాత.

"సామాన్లు కాదు. పోటీ కొనుక్కున్నాం. అంతే... ఇక నుంచయినా మూడు పూటలు రంది లేకుంట తింటం" కుదురుగా అన్నాడు వీరేశం.

ఆ రాత్రి ఇద్దరికీ హాయిగ నిద్రపట్టింది.

తెల్లవారి లేచి చూస్తే మాత్రం దేవదాసు దుకాణం తెరిచి ఉంది. కొత్త సామాన్లతో నిండుగా ఉంది.